ప్రబంధాలలో హాస్యం

ఈ హ్యూమర్ అనేది స్వతహాగా మనిషిలో ఉంటేనేగాని, వ్రాతలో రాణించదు. హాస్యం చెప్పడం ప్రతీవాడికీ చాతవుతుందా? అదిగాక, యెదటివాడు మనమాటలకు నవ్వేడంటే, కేవలం ఆమాటల్లోగల హాస్యరసం గ్రహించి, సంతోషించి, నవ్వేడని అనుకోకూడదు. ఏకారణంచేతనైనా, నవ్వవచ్చును. ఏమంటే, నవ్వు నాలుగువిధాలు. నవ్వొచ్చి నవ్వడం- నవ్వకుంటే బాగుండదని నవ్వడం- నవ్వాలికాబోలని నవ్వడం యేడవలేక నవ్వడం.

సాధారణంగా యితరులకు నవ్వుకలిగించేది మనలో ఉండే తెలివితక్కువతనం, అందుకనే, పసిపిల్లలు పిచ్చివాళ్లు మనని సులభంగా నవ్వించగలరు. కాని, పిచ్చిపిచ్చి వ్రాతలవలన పాఠకులను మెప్పించి, నవ్వించాలని యత్నించడం, కవికి గొప్ప కాదు. మన పూర్వకవుల పుస్తకాల్లో హాస్యరసం అంతగా కనిపించకపోవడానికి యిదేకారణం కావచ్చును. శోకం, భక్తి, శృంగారం- ఇలాటి రసాలు ప్రతిగ్రంథం లోనూ కనిపిస్తాయి. కాని, హాస్యరసం అనేది యే పుస్తకం పిండినా, పదిబొట్లు రాలవు. కథలో హాస్యరసం యిముడ్చలేక, మనకవులు కొందరు వేరే ఒక విదూషకుని నిర్మించి, ప్రబంధాల్లోనూ, నాటకాల్లోనూ దూర్చారు.

ఇంగ్లీషుకవుల వ్రాతల్లో స్ఫురించే హాస్యరసం యింతకంటే యింపుగాను, నాజూకుగాను ఉంటుంది. ఇటీవల మన ఆంధ్రకవులుకూడా తక్కిన రసాలతో పాటు, హాస్యరసానికి సహితం కొంతగౌరవం యిస్తున్నారు. కాని కేవలం హాస్యరసమే ప్రధానంగాగల గ్రంథాలు చాలా అరుదు.

ఇందుకు కారణం యేమిటి? మన కవులకి నవ్వించడం చాతగాకనా? లేక, చాతనయికూడా యీ రసంలో ఉండే మహత్తును గ్రహించలేకనా? లేక, 'నవ్వు నాలుగు విధాలచేటు' అన్న పెద్దలవాక్యం యెరిగి, నవ్విస్తే పాపం అనే ఊహచేతనా? కవులకే కాదు, యెవరికైనాగాని ఒకర్ని యేడిపించడంకంటె, నవ్వించడమే ఘనత, కాని, యేడిపించడం సులువని తోస్తుంది. అందుకనే, కొందరుకవులు ఒకర్ని యేడిపించి, ఆమూలంగా మరొకర్ని నవ్వించాలని యత్నిస్తారు. దీనినే వెకలిహాస్యం, వెక్కిరింత అంటారు.

పరిశుద్ధమయిన హాస్యరసం అనేది, తేటగా, శుభ్రంగా, తియ్యగా అమృతంవలె ఉండాలి. అంతే కాని, అరవ కాఫీలాగు నల్లగా చేదుగా కొందరికి, ఘాటుగా రుచిగా కొందరికి, ఉంటే లాభం లేదు. అందరికీ ఒకే విధమైన రుచి, ఆనందం కలుగజేసేదే నిజమైన హాస్యం.

హాస్యం అంటే కొందరు అర్థంచేసుకోలేక, మోటసరసంలోకీ, వెక్కిరింతలోకీ దిగుతారు. భాగోతులు, హరికథలు చెప్పేవాళ్లు, సురభినాటకాలలో హాస్యగాడివేషం వేసే వాళ్లు- వీళ్ళంతా యిదే మచ్చు. ఇంగ్లీషుగ్రంథాల్లో హ్యూమరనీ, బఫ్ఊనరీ అనీ, ఐరనీ అనీ, సెటైరనీ, హాస్యం అనేక విధాలుగా గోచరిస్తుంది. మన తెలుగు పుస్తకాలలో యిన్ని రకాలు కావు సరేసరి కదా, మెచ్చుకోతగిన రకం యేదీ కనిపించదు.

కొంతవరకు వీరేశలింగంపంతులుగారి పుస్తకాల్లోను, చిలకమర్తి వారి పిట్టకథలలోను, పానుగంటి పంతులు నాటకాల్లోను, హాస్యరసం అక్కడక్కడ చిలికి వున్నది. ఒక్క 'కన్యాశుల్కం' మాత్రం హాస్యరసగ్రంథాలలో సుప్రసిద్ధమై ఉన్నది. అప్పారావుపంతులుకు హ్యూమ రనేది స్వతహాగా అలవడినట్లుంది. ఆమోస్తరుగా కడుపు చక్కలయేటట్లు నవ్వించే పుస్తకం తెలుగులో కాదు సరేకదా, మరేభాషలోనైనా వున్నదా అని సందేహించవలసొస్తుంది. వెంకటరాయశాస్త్రిగారి ప్రతాపరుద్ర నాటకంలో కూడా హాస్యరసం మెండుగానే స్ఫురిస్తుంది. కొంతకాలంక్రిందట బుద్ధిరాజు ఈశ్వరప్ప పంతులుగారు కేవో చిన్నచిన్న హాస్యగ్రంథాలు ప్రకటించియుండిరి, మంచి తమాషాగా ఉండేవి.

కొందరిప్పుడిప్పుడు యేవేవో పిట్టకథలు ప్రహసనాలు టిట్‌బిట్‌సూ వ్రాస్తున్నారు. కాని అవి లిటరేచర్‌లో యెంతమట్టుకు నిలుస్తాయో నిలకడమీదకాని తెలియదు.

తెలుగు పుస్తకాలలో హస్యామరనేది కొరతగా వుండడం విచారకరమైన సంగతేకాని అంతకంటే విచారకరమైన సంగతేమిటంటే, కవులు హాస్యం వ్రాయబోయి అసందర్భాలు రాయడం! నవ్వుతాలు నాజూకుగా ఉంటేనే ముద్దు. లేకుంటే రోత. ఆనందించి నవ్వుకోడానికి బదులు అసహ్యంవేసి కవిని తిట్టాలనిపిస్తుంది. జ్ఞానంలేని పసిపిల్లలకు బూతుమాటలు నేర్పి నవ్వుకొనే మూర్ఖులుంటారా అనుకోకూడదు. అంతకంటే అన్యాయంగా వుంటుంది కొందరుకవుల హాస్యం.

మా పురాణం శాస్త్రిల్లుగారితో ఒకనాడీ హాస్యరసంగూర్చి ప్రస్తావిస్తే ఆయన కాళిదాసు శ్లోకాలేవో చదివి అర్థంచెప్పడం ప్రారంభించాడు. నాకే సంస్కృతంలో యేమీ ప్రవేశం లేనందున 'అయ్యా, శాస్త్రిగారూ, తమరు చదివిన తెలుగు గ్రంథాలలో యేవైనా ఉదాహరణలు తీసి చదివిన తెలుగుగ్రంథాలలో యేవైనా ఉదాహరణలు తీసి చదవండి' అని అడిగాను.

కొంతసేపాలోచించి, ఆయన యేవేవో తమాషాపద్యాలు చదివేడు. కొన్ని కొంచెం మోటుగాను, కొన్ని కేవలం పచ్చిగాను, కొన్ని నిజంగా సరసంగానూ, ఉన్నాయి. 'ఇవే గ్రంథంలోవిచెప్మా' అని నేను తటపటాయిస్తున్నానని అనుకొని, ఆయన, "ఇవి చాటువులండి. మన పూర్వకవులు చెప్పినవే అంటారు. కాని యేపద్యం యేకవి చెప్పిందో, ప్రమాణం చూపించగలరా అంటేమాత్రం, కష్టం. ఉప్పెనగా నవ్వొచ్చేవన్నీ తెనాలికవివే అంటాను. ,నానా సూనవితాన వాసనల, అన్న ముక్కుమీద పద్యంలాగ. తిమ్మన్నదేనా అంటే' తిమ్మన్నది కాకూడదా, అనుకోవాలి' అని సమాధానం చేప్పేడు.

"చాటుపద్యాల మాటకేం లెండి. పొడుపుకథ పద్యాలు, ఆశుధారలు, సమస్యలు పూర్తిచేస్తూ చెప్పిన పద్యాలు, పాండిత్య వైరంచేత కవులు ఒకరినొకరు తిట్టుకుంటూ వ్రాసిన పద్యాలు, ప్రభువులు సత్కరించనప్పుడు కసిచేత వాళ్ళను దూషిస్తూ, చంద్రరేఖా విలాపంవంటి పుస్తకాలు రాసిన కవుల మోటుపద్యాలు, 'దీని భావ మేమి తిరుమలేశ, అన్న పద్యాలు,- వీటిమాట నే నడగలేదు. ఉత్తమ గ్రంథాలని మీరు భావించే పుస్తకాలలో ఉండే చమత్కారమైన పద్యాలు తీసి చదవండి పకపక నవ్వించేవిగాని చిన్నచిన్న చిరునవ్వు కలుగజేసేవి కాని ఉత్తమగ్రంథాలలో నవ్వుతాలుంటాయా అండి" అన్నాడు శాస్త్రుల్లు.

ఎందుకుండకూడదు. ఇంగ్లీషులో షేక్స్పియరనే మహాకవి గొప్పగొప్ప విషాదాంతనాటకాలలో సహితం హాస్యరసం కురిపిస్తాడు అని చెప్పేను.

నవలలు నాటకాలు వీటిలో కవికి ఉండే స్వేచ్ఛ ప్రబంధాలలో ఉండదు. పురాణాలలోను ప్రబంధాలలోను హాస్యరసం యిమడడానికే చోటుండదు. ఎంతసేపు కవనగాంభీర్యం అనేది పదగుంభనలోను, ప్రకృతివర్ణనలోను, విశదపడాలి.

"అంతేనా? కథాకల్పనో? అందులో కవికి వొల్లమాలిన స్వేచ్ఛవుందిగా' అన్నాను.

మనవాళ్లు మంచి మంచి కథలు కల్పించుకొని ప్రబంధాలు రాశారనుకున్నారా యేమిటి? మన తెలుగుకవులు కథకోసం యెన్నడూ శ్రమపడి యెరగరు."

"అయితే తెలుగులో స్వతంత్రగ్రంథాలే లేవనా తమ అభిప్రాయం" అని అడిగాను.

"ఇంచు మించు అలాగే చెప్పవలసి వస్తుంది. నాగరంలో లేని కథయేదీ మన కవులు యెత్తుకోలేదు, పురాణాలయితే నేమి, ప్రబంధాలైతేనేమి, అన్నింటికీమూలం సంస్కృతం."

"కావచ్చును. కథయేదైనా, రచనావిధానంలో కవి చమత్కారం చూపవచ్చును కదూ!"

"నిజమే లెండి. కాని మన పురాణగ్రంథాలన్నీ భక్తిప్రధానమైనవి. కాబట్టి చొరవచేసి, కవులు హాస్యరసం వాటిలో యిరికించలేరు. నవ్వులాటలు రాస్తే, దైవభక్తి అనేది నిలుస్తుందా?" అన్నాడు శాస్త్రుల్లు.

"అదికాదు. దేవుళ్ళనీ, దెయ్యాలనీగూర్చి వ్రాసేటప్పుడు హాస్యం చెప్తే, బెడిసికొడుతుందని భయం చాత కాబోలు! పోనీ, ప్రబంధాలమాట చెప్పరేం?"

"అవైనా, అన్నీ ఒకేమాదిరిగా ఉంటాయి. కథయేదైనా, కట్టుబాట్లు అధికం గనుక, ఒకకవిని చూసి యింకోకవి, ఆకవినిచూసి మరోకవి, అందరూ ఒకటే ఫక్కీ అవలంబించేరు. అంచాతనే, మీరు కోరిన చమత్కారపద్యాలు యెక్కడో కాని కనిపించవు. ఒరిజినాలిటీ లేనప్పుడు హాస్యానికి అవకాశంయేదీ?" అని శాస్త్రుల్లు తలవూపుస్తూ, పెదిమె విరిచాడు.

"స్వతంత్రించి, కొత్తదార్లు తొక్కి, చమత్కారంగా రాసిన కవులు లేరన్న మాటా?" అని నవ్వుతూ అడిగాను.

"లేరండి. అందుకు కారణాలు లేకపోలేదు. ఇప్పుడు చూశారా, ఒక ప్రబంధం చెయ్యాలంటే మన కవులు ముఖ్యంగా ఆలోచించిన దేమిటి? ఇది యేరాజుకు అంకితంగా చెప్పాలి అని. అంతే, కథ కల్పించుకోవలసిన అగత్యంలేదు. పురాణాల్లోను, సంస్కృత నాటకాల్లోను, కావలసినన్ని కథలున్నాయి. ఇక రచనావిధానం పూర్వులు స్థిరపరిచేవుంచారు. కొన్ని యిష్ట దేవతాపద్యాలు, గురుస్తుతి, ఆ వెనక కథాప్రారంభం. అనగా, పురవర్ణన– రాజుగారి కీర్తిప్రభావము– వసంతఋతు వర్ణన– వేట– అడవిలో ఉండే చెట్లు, మృగాలు, వీటితాలూకు జాపితా– రాజుగారు అలసి విశ్రమించబోయేసరికి సమీపంలో కిన్నెరగానం వొళ్లు పరవశం చేసేటట్లు వినరావడం– పిదప దేదీప్యమాన మైన స్త్రీరత్న దర్శనం– మోహం– తాపం– విరహం– యుద్ధం– గాంధర్వవివాహం– భరతవాక్యం.

"ఈవిధంగా యేదో గాథ తీసుకొని అంకితం యివ్వబోయే రాజుగారిని అందులో నాయకుణ్ణి చేసి పొగడి మెప్పించి భూమో పుట్రో బహుమానంగా సంపాదించడం, మన కవుల ముఖ్యోద్దేశం. యమకం, చమకం, ప్రాస, ద్వంద్వార్థపదాలు, చాంతాళ్ళలాటి సంస్కృత సమాసాలు, అచ్చ తెలుగు పదాలు, వీటితో తమ పాండిత్యం వెల్లడిచేస్తూ, ఛందోదోషాలు లేకుండా, కట్టుబాట్లు దాటకుండా, రాజుగారికి కోపం రాకుండా గ్రథం తయారుచెయ్యాలి. కథలో సందర్భం లేకపోయినాసరే, వర్ణనలేవీ విడిచిపెట్టకూడదు. అనగా పురవర్ణన, ప్రాతఃకాలవర్ణన, సంధ్యాకాలవర్ణన, చంద్రోదయవర్ణన, చంద్రదూషణ, వసంతఋతువర్ణన, తుమ్మెదల శృంగార గానం, మన్మథదూషణ, నాయికా నాయికుల రూపవర్ణన,(నఖశిఖపర్యంతమును)–సంభోగవర్ణన."

"అయితే, శాస్త్రుల్లుగారూ, ఇన్ని రాయడానికి ఓపిక వుందిగాని, మన కవులకు కాస్త హాస్యమరుకే అవకాశం లేకపోయిందా?" అని మెల్లగా నవ్వుతూ అన్నాను.

"అట్లా అంటే, నే నేం చెప్పేది? అవకాశం లేకకాదు. శృంగారరసమే మన కవులకు ప్రధానంగా కనిపించింది. పోషకులచిత్తవృత్తి ననుసరించి కదా వాళ్లు కృతులు చేయవలసి యుండెను? అయినా, హాస్యరసం కూడా కొన్ని కొన్ని ప్రబంధాలలో అక్కడక్కడ చిలికి వున్నది."

"ఒకటిరెండు పద్యాలు ఉదాహరణకింద చదవండి" అని శాస్త్రుల్లుగారిని హెచ్చరించెను. ఇది చిత్తగించండి:—

అన్నులమిన్న రోర్తు వసుధాధిపనందనుఁ జూడఁగోరి వా
ల్గన్నులఁ గుంకుమంబు, నొసలన్న వకజ్జలమున్ ధరించి,లో
నెన్నఁగరానితత్తఱము హెచ్చఁగ నచ్చుగ రాజపద్ధతిన్
గ్రన్నగవచ్చె!-దానిఁగని కాములందఱునవ్విరొక్కటన్.

ఇది 'రసికజనమనోభిరామము'లోనిదండి, కూచిమంచాయన కవిత్వం చాలా సరసంగాను, హాయిగాను ఉంటుందండి."

"అది నిజమేకాని, యీపద్యంలో నా కేమీ సరసత కానరాలేదండి. వర్ణనలో అతిశయోక్తి యెంతవున్నా, అది కొంచెం స్వాభావికంగా ఉంటేనే కాని, రాణింపులేదు." అన్నాను.

"పోనీ, ఇది చూడండి. హాస్యం, శృంగారం రెండు రసాలు స్ఫురిస్తాయి. ఆ ప్రబంధంలోనిదే :

ఉవిద యొక్కతె వెలికిల నుండి, నీటఁ
దేలుచో, నొక్క రాయంచ తివిరి తమ్మి
మొగ్గ యంచును దాని చన్మొగడ వొడువఁ
గలికి యలికి, యొగించుక యులికిపడియె."

"శాస్త్రుల్లుగారూ, హాస్యంలో యేదైనా విపరీత భావం స్వాభావికంగా స్ఫురించాలి. ఈ పద్యంలో హాస్యరసంపాలుకంటె, శృంగార రసం పాలు జాస్తీగా వుంది. కొంచెం మోటైనా, పద్యం బాగుంది." అనాను.

ఆమాట నేరకపోయి, నోరుజారి, యెందుకన్నానా అనిపించింది, చివరకి. ఇట్టి పద్యాలే కాబోలు నేను చదవమన్నానని, అనుకొని శాస్త్రుల్లు వరస పెట్టి, శృంగార నైషధంలో నుంచి రాగవరసతో చదవడం ప్రారంభించాడు. నాకు నవ్వొచ్చి, ఆపుకోలేక, ముఖం పక్కకుతిప్పి, చిరునవ్వు నవ్వుకున్నాను. పద్యాలలోవుండే స్వారస్యం గ్రహించి, ఆనందిస్తున్నానని భావించి, ఆయన మరీ ఉత్సాహంతో చదివేడు పద్యాలు.

'నేత్రము వేను, జీరయును నేత్రము; చీరకు నాశ్రయింపఁగా
బాత్రతగల్గె, నాకు నిటఁ బాత్రత లేదని నామసామ్యతై
చిత్రికతంబునన్ బలిమిఁ జేకొనినట్టులు రాజుదృష్టి యా
త్రిజగకన్యచారుకటిచక్రము నూరుయుగంబు దూఁకొనెన్.

గంధజలపూరితంబులై కమలముఖుల
కరములం గన్న మణిహేమ కలశములకుఁ
జెలువ మగు భీమకన్య చన్నులకు నోడి
దాస్యమున నీళ్లు మోచుచందంబు గలిగె.

అల్లన యొకర్తు వగ్గు కృకలాసముఁ జేరఁగఁ దెచ్చి, వంచనన్
నలునకుఁ గుంచెపట్టు నెలనాగ పదద్వయమధ్యమంబునన్
నిలిపినఁ గాలు ప్రాఁకనది నీవియసీమకుఁ దోడి భామినుల్
గలకల నవ్వ నూడ్చెనది, గట్టినపుట్ట ముపాయశూన్యతన్.

అవ్వలి దిక్కు మోమయి ప్రియంబుననొండులకోడ యుచ్చటల్
ద్రవ్వుచు నొక్కకోమలిపరాకుననుండఁగ, ధూర్తుఁడొక్కరుం
డివ్వల వచ్చి వంచనమెయిన్ నునుమించు మెఱుఁగుటద్దమున్
నవ్వుచుఁ బట్టె దానిచరణంబులకు న్నడుమైన మేదినిన్.

ఓమె యేమె యి దేమేమె లేమ యేమె
మేఘుపుష్పంలు దేవంచు మేలమాడ,
మేమె మేమెలు దఱచయ్యె మేలు మేలు
మేక మేకన సభవారు మిగుల నరిగి.

ఉష్ణశీతాన్నకబళంబు లొకఁడు నూపఁ
బవలొ రాత్రియొ గొడగూడ నవసర మని,
దాని కుత్తర మొక లతాతన్వి యిచ్చె
నధరబింబంబు విఱిచి సంధ్యాగమ మని.

మదగజరాజకుంభముల మచ్చరికించు చురోజకుంభముల్
గదసి కలంత మేరయును గ్రైకొనియున్నది యెల్ల వారికిన్
విదితముగాక, నిట్టితరి నీ చెలిడెందమునందు నేమియుం
గదలక మాకు నుండ నవకాశము లేదుగదే కళావతీ?

రమణిహృదయంబునను మహారాజ నీవు
గరిమ విచ్చేసి యుండిన కారణమున
దీని వక్షోరుహంబు లాలోన నుండ
నెడము లేకున్న మరికదా, వెడలె వెలికి?

శాస్త్రుల్లుధోరణి అంతకంతకూ ఉద్రేకంతో చెలరేగుతూ వుండడం కనిపెట్టి, యిక ఊరుకుంటే లాభంలేదని, "ఇక చాలును లెండి.....అబ్బా, ఎన్నిపద్యాలు కంఠోపాఠం చేశారు!" అన్నాను.

"సావకాశంగా కూచుంటే యింకా యితరకవులను వినిపిస్తాను.

"ఎందుకు లెండి? ఇట్టి పద్యాలు కావు నేనడిగనవి. మీ పూర్వకవులకందరికీ ఒక నమస్కారం. వాళ్ళజోలి మనకొద్దు హాస్యం అన్నా, శృంగారమన్నా, వాళ్ళకు విపరీతభావన లుండేడివని తోస్తుంది" అన్నాను.

కొంతసేపు నావేపు నిర్ఘాంతపడి చూసి, "అదేమిటి అట్లా సెలవిస్తున్నారు" అన్నాడు శాస్త్రుల్లు.

ఇక ఈయనతో వాదించి లాభంలేదని తోచింది.

—తాతా కృష్ణమూర్తిగారు, బి.ఏ.ఎల్.టి.